


ఉస్మాన్‌రోడ్‌లోంచి కోడంబాకం హైరోడ్‌లోకి తిరిగేడు చంద్రమౌళి. 'హిట్' పిక్చర్ రెండు భాషల్లో వాయించేసినట్టు వడగాలుపు ఈ చెంపా, ఆ చెంపా కూడా వాయించేస్తోంది. వేడి చెప్పుల్లోంచి అరికాళ్ళలోకి దిగుతోంది. ఒక్క అంగలో రోడ్డు దాటేడు చంద్రమౌళి.

రావ్స్ ఇంటర్నేషనల్ హోటల్ మళయాళం మోర్నింగ్ షో ఆడే సినిమా హాలులా జనంతో కిటకిటలాడి పోతోంది. మినీ లంచ్‌లు అందిస్తూ సర్వర్లు హడావిడిగా తిరిగేస్తున్నారు. 'ఈ లంచ్ ఒక ఆకలి తీరిస్తే మళయాళం శృంగార చిత్రం మరో ఆకలి తీరుస్తుంది'-నిట్టూర్చేడు చంద్రమౌళి. హాలులో జనం ఎగబడి తింటున్నారు. చంద్రమౌళి కడుపులో నరాలు ఆకలితో మూలిగేయి. దృష్టి హోటల్ మీంచి తప్పించి గబగబా నాలుగు అడుగులువేసి బస్ షెల్టర్ క్రింద కొచ్చి నిలబడ్డాడు.

రాయ్‌పేట వెళ్ళే బస్ ఎప్పుడొస్తుందో? ఏంటో? ఈవేళప్పుడు ఆసుపత్రి గేటువాడు లోపలకు రానిస్తాడో - లేదో? బాబ్జీకి ఎలా వుందో... ఏంటో? రకరకాల సందేహాలు అతన్ని తొలిచేస్తున్నాయ్.

బస్ షెల్టర్ ఎండ నించి పూర్తి రక్షణ ఇవ్వలేక పోతోంది. సినిమాలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలా చాలీ చాలకుండా వుంది. ఎండ రిఫ్లెక్టర్‌తో కొట్టినట్టు చంద్రమౌళి ముఖం మీద పడుతోంది. వాతావరణం వేడికి గుండె లోపల బాధకి 'గ్లిజరిన్' అక్కర్లేకుండానే చంద్రమౌళికి కన్నీళ్ళొస్తున్నాయ్.

ఇంతలో ఎవరో వచ్చి బస్ కోసం కాబోలు పక్కనే నిలబడ్డారు. అతన్ని చూసిన చంద్రమౌళి ఉలిక్కి పడ్డాడు. రిలీజ్ ముందు ఫైనాన్సియర్ని చూసిన నిర్మాతలా కంగారు పడ్డాడు. ముఖం పక్కకు తిప్పుకున్నాడు. నిలబడిన మనిషి సినిమా జూనియర్ ఆర్టిస్ట్ తంగవేలు. తనెవరో తంగవేలుకి బాగా తెల్సు. చంద్రమౌళి దూరంగా వెళ్ళి నిలబడ్డాడు.

తంగవేలు తన సినిమాల్లో చాలా సార్లు నటించేడు. హీరోగా తను క్లబ్ దృశ్యాల్లో ఫైట్ చేస్తుంటే - క్లబ్‌లో మందుతాగే మనిషిగా తంగవేలు వుండేవాడు. సారా కొట్టులో సెక్సీ స్టార్ 'మాలా'తో తను స్టెప్పులు వేస్తుంటే వెనక చేరి తప్పట్లు కొట్టే మందు దాసుల్లో తంగవేలు తప్పకుండా వుండేవాడు. ఊటీలో తను హీరోయిన్‌తో డ్యూయెట్ పాడితే గుర్రంతోలే మనిషిగా తంగవేలే - తనతో ఎన్నో వేషాలు వేశాడు. అతని మంచి తనంవల్ల అతని కెప్పుడూ వేషాలు దొరికేవి. తను కూడా అతనికి వేషాలు రికమెండ్ చేసేవాడు.

తనంటే తంగవేలుకి గౌరవం. ఆ గౌరవమే ఇప్పుడు ఇబ్బందికి కారణం. తను తంగవేలు కళ్ళలో ఈ స్థితిలో పడడానికి ఏళ్లేదు.

తను టి.సి. కారుదిగుతూ తంగవేలు నమస్కారం అందుకున్నాడు. విమానం దిగుతూ అందుకున్నాడు. ఫైవ్‌స్టార్ హోటల్ బాల్కనీ లోంచీ తంగవేలుకి చెయ్యి ఊపేడు. ప్రముఖ హిందీ నటుడు ఉజ్వలఖన్నా సరసన నిలబడి చెయ్యి ఊపేడు. ఇప్పుడీ కోడంబాకం బస్ షెల్టర్ క్రింద బస్ కోసం ఎదురు చూస్తూ తంగవేలు నమస్కారం అందుకోనూ లేడు, భరించనూలేడు. ఆ స్థితి ఏర్పడేకంటే లవకుశ సినిమాలో అంజలీదేవిలా విడిపోయిన భూమిలో తను కల్సిపోయినా సంతోషమే.

చంద్రమౌళి మరి కాస్త పక్కగా జరిగి తలతిప్పుకుని కళ్ళ కొసల్లోంచి తంగవేలుని చూశాడు. అరవైలో కూడా ఇరవై ఏళ్ళయువకుడిలా వున్నాడు తంగవేలు. తను నలభైకే... యాభై ఏళ్ళ వాడిలా వున్నాడు.

తంగవేలు వేసిన కాంజీవరం సిల్కు చొక్కా ఎండలో ధగధగా మెరిసి పోతోంది. చొక్కాయే కాదు. అతని చొక్కా జేబులో వున్ననూరు రూపాయిల నోటు కూడా మిలమిలా మెరిసిపోతోంది. ఆ నోటు చూడగానే చంద్రమౌళికి ఏదో గుర్తు కొచ్చింది.

అవును. అయిదొందులు "దొంగమ్మ - దొంగోడు" శత దినోత్సవానికి తను తంగవేలుకి ఇచ్చాడు. ఆరోజు అతని కొడుక్కి సీరియస్‌గా వుందంటే ఇచ్చేడు. ఈ రోజు తన కొడుక్కి సీరియస్‌గా వున్నప్పుడు తంగవేలు కనపడడం యాదృచ్ఛికమా?


తంగవేలుకే కాదు. ఎందరికో తను డబ్బిచ్చేడు. ఇళ్ళు కాలిపోయేయని ఏడ్చే పేద ప్రజలకి ఇచ్చాడు. వళ్ళు కాలిపోతోందని ఏడ్చిన సరసులైన స్నేహితులకి ఇచ్చాడు. పుట్టిన ఊరులో ఒక్కొక్క వీథికి ఒక్కొక్క భావి తవ్విస్తే... పెరిగిన ఊరులో ఒక్కొక్క మిత్రుడికి ఒక్కొక్క విస్కీ బాటిల్ ఇచ్చాడు.

అది గతం. ఇప్పుడు తన జేబులో మూడున్నర వుంది. తను మూడు రోడ్ల జంక్షన్లో బస్ కోసం ఎదురు చూస్తూ నిలబడి వున్నాడు. తన కొడుకు ఆసుపత్రిలో వున్నాడు. ఇదీ ఇప్పటి స్థితి.

అప్రయత్నంగా తంగవేలు ఇటు తిరిగేడు. టక్కున చంద్రమౌళి తల తిప్పుకున్నాడు. అతని గుండెలు గుబగుబ లాడేయ్. తంగవేలు తన్ని గుర్తు పట్టేడా? లేదేమో! గుర్తు పడితే పలకరించేవాడుగా ... ఏమో...

ఈ క్షణంలో తనకి భగవంతుడు కనపడితే తనేమని కోరుకుంటాడు. ఎందుకో చిత్రమైన ఆలోచన కలిగింది చంద్రమౌళికి... ఏమని కోరతాడు? "భగవాన్ నా ముఖం మార్చేయ్... నన్నెవరూ గుర్తు పట్టకుండా చెయ్యి లేదా నా ప్రాణాలు తీసేసుకో అని కోరతాడు. నాకే కాదు ఫేడవుట్ అయిన పెద్ద హీరోలందరి రూపం మార్చేయ్యమని ప్రార్థిస్తాడు.

చంద్రమౌళిలో ఆలోచనలు సాగుతుండగానే రాయ్‌పేట వెళ్ళే బస్ మెల్లిగా కోడంబాకం బ్రిడ్జి దిగుతోంది. తేలిగ్గా ఊపిరి వదిలేడు చంద్రమౌళి. బస్




లంచాలకు అలవాటుపడిన ఆఫీసరు తన క్రింది ఉద్యోగితో -

"ఏమండీ రవిగారూ ప్రమోషన్‌తోపాటు ఆదాయం కూడా వచ్చే ఉద్యోగాన్ని ఎందుకు వద్దను కుంటున్నారూ?"

"ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగమైనా వుంటుందని."

— పి. రాంబాబు



చూడగానే తంగవేలు ముందుకు అడుగు వెయ్యడంతో ఉలిక్కి పడ్డాడు.

భగవాన్! ఏమిటీ పరీక్ష? తంగవేలు ఎక్కాల్సింది కూడా రాయ్‌పేట బస్సేనా? బస్ ఎక్కితే తనని తంగవేలు చూస్తాడు. చూస్తే ఊరుకోడు. అతి గౌరవం ఇస్తాడు. బస్సులో వాళ్ళంతా తమిళులేమో... తనెవరో తెలీక 'ఎవడీ గొట్టంగా'డన్నట్టు చూస్తారు – ఎక్కడం మానేద్దామంటే బాబ్జీకి ఎలా వుందో ఏమిటో? పరిపరి విధాల చంద్రమౌళి ఆలోచిస్తుండగానే బస్ వచ్చి స్టాపులో ఆగింది. తంగవేలు బస్ ఎక్కేశాడు. చంద్రమౌళి తలొంచుకుని తంగవేలుని తిట్టుకుంటూ నిలబడి పోయాడు. బస్ ముందుకు వెళ్ళి పోయింది.

చంద్రమౌళి ఇబ్బంది గమనించి పని లేక పోయినా రాయ్‌పేట బస్ ఎక్కేసి, నెక్స్ట్ స్టాపులో దిగిన తంగవేలు 'ఆ సార్‌కి ఇంతకంటే నేనేం చెయ్యగలను?' అని వాపోయాడు.

చంద్రమౌళి తంగవేలునీ, వీథినీ, ఆసుపత్రిలో వున్న కొడుకునీ తిట్టుకుంటూ మరో బస్ కోసం ఎదురు చూడసాగాడు.

తన 'ఈగో' జయించలేక పోయాడు. అందువల్లే అదే బస్ ఎక్కలేక పోయాడు. ఆసుపత్రికి తను వేళకి వెళ్ళ లేక పోవడం వల్ల తన కొడుక్కి ఏం కాదు కదా! ఆ ఆలోచనకే వణికి పోయాడు చంద్రమౌళి. సిరిసంపదలు పోయినా... పరువు ప్రతిష్ఠలు దిగజారుతున్నా –వాడ్ని చూసుకునే తను బ్రతికేది. తన ఆరిపోయే జ్యోతి. వాడు తనకి ఆశాజ్యోతి. వాడి బ్రతుకు వెలిగి పోవడానికి తను ఇంధనమై రాలిపోయినా ఫరవాలేదు. వాడికేం కాకూడదు. అప్రయత్నంగా కన్నీళ్ళొచ్చాయ్ చంద్రమౌళికి.

గ్లిజరిన్ లేకుండానే ఇటీవల తనకి తరచు కన్నీళ్ళొస్తున్నాయ్. నిజమే అది సినిమా – ఇది జీవితం. కాని తన జీవితం సినిమా లాగే నడిచింది.

రాజమండ్రి ఔట్ డోర్ షూటింగ్‌కివచ్చిన ఓ ప్రముఖ చిత్ర దర్శకుడు తను నాటకం వేస్తుంటే వచ్చి ఆఖరి బెంచీలో కూర్చున్నాడని తనకి తెలీదు.

నాటకం అయిన తరువాత అతను వేదిక మీదికి వచ్చి ఆ సినిమాలో తనకి సెకండ్ హీరో వేషం ఇస్తానని ప్రకటించినప్పుడు అంతా తెల్లబోయారు.

షూటింగ్‌కి రాలేక పోతున్నానని ఆ రోజే ఓ ప్రముఖ హీరో ఇచ్చిన టెలిగ్రాం తనకి అదృష్టదేవతని టెలిగ్రాం రూపంలో తెచ్చింది. ఆనందంతో తను తెల్లబోయాడు. తను తెల్లబోయి తేరుకునేంతలో... చిత్రం పూర్తయి, విజయవంతమయింది. తెలుగు తెర మీద తనో హీరో అయిపోయాడు.

అక్కడ నించి అంచెలంచెలుగా తారా పథానికి ఎగబాకి పోయాడు. సొంత చిత్రాల నిర్మాణం ఆరంభించేడు. అయినవాళ్ళంతా చేరారు. కలర్ రీలులా జీవితం తిరిగి పోతుంటే... చిత్రాలు పరాజయం పొందడం మొదలెట్టాయ్. సొంత చిత్రాలు ఆడడం మానేశాయ్. డిస్ట్రిబ్యూషన్ సంస్థ మూతబడింది.

కప్పలు ఒక్కొక్కటే వెరువు ఒదుల్తుంటే కాని వెరువు ఎండిపోతోందని తను గ్రహించలేదు. గ్రహించే వేళకి ఆలస్యమయిపోయింది. సుమతీ శతకకారుడు చెప్పినట్టు సిరి అంతా కరిమింగిన వెలగపండు అయిపోయింది.

అన్నిటి కన్నా దురదృష్టం... ధనలక్ష్మి వెళ్తూ... వెళ్తూ గృహ లక్ష్మిని వెంట తీసుకుని వెళ్ళిపోయింది. ఆ వ్యధలో వడిలిన ముఖం చూసి, నిర్మాతలు ముఖం చాటేశారు. ఫ్లాప్ మీద ఫ్లాప్స్... చిత్రాలు ఘోరంగా పరాజయం పాలయ్యేయి. నిర్మాతలు ముఖం చాటేశారు.

చిన్నప్పుడు రంగులు విరజిమ్ముతూ నింగిని తాకాలని వెళ్ళే తారాజువ్వని చూసి తను చప్పట్లు చరిచేవాడు. దాంట్లో శక్తి వుడిగిన తరువాత అది తిరిగి నేలకి ప్రయాణం మొదలెట్టగానే తను తలతిప్పుకునేవాడు. అలాగే నిర్మాతలు, దర్శకులు ప్రేక్షకులు... తన ఎదుగుదలకి చప్పట్లు చరిచేరు, తన పుట్టిన రోజుకి ప్రత్యేక సంచికలు తెచ్చారు. పూల హారాలు గుప్పించేరు. తన అదృష్ట శక్తి అదృశ్యం కాగానే, తను పతనానికి చేరడం మొదలుకాగానే తలలు తిప్పుకున్నారు. అది వాళ్ళ తప్పు కాదు. అదంతే... అంతా అయ్యేకా మూసుకుంటే చివరికి మిగిలింది – తనకి బాబ్జీ– బాబ్జీకి తనూ అంతే. ఆ బాబ్జీ ఇప్పుడు ఆసుపత్రిలో వున్నాడు.

ఆలోచనల్లో తేల్తున్న చంద్రమౌళికి ఏదో బస్ వస్తున్నట్టు అనిపించింది. నిజమే బస్ వస్తోంది. కాని అదెక్కడికి వెళ్ళే బస్సో బోర్డు కనపడడం లేదు. అది రాయ్‌పేట వెళ్ళే బస్ కావాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కు కుంటూ నిలబడ్డాడు చంద్రమౌళి.


మరుక్షణం ఈ మధ్య తను అమ్మేసిన వెండి విగ్రహంలోని వెంకటేశ్వరుడు తన మీద ఆగ్రహించడు కదాని భయమేసింది చంద్రమౌళికి. ఎందువల్లో వెంకటేశ్వరుడు ఆగ్రహించలేదు. రాయ్‌పేట బస్ వచ్చి స్టాపు ముందు ఆగింది.

గబగబా బస్ ఎక్కేశాడు చంద్రమౌళి. బస్ ఎక్కేసిన తరువాత కాని తెల్సున్న వాళ్ళు ఎవరైనా బస్‌లో వున్నారేమోననే ఆలోచన రాలేదతనికి. వచ్చిన తరువాత చుట్టూ చూసే ధైర్యం లేక పోయింది. టికెట్ తీసుకుని అప్పుడే ఖాళీ అయిన సీటులో కూర్చుని తలొంచుకున్నాడు. బస్ బయల్దేరింది. దాంతో పైటి గాలి విసురుగా కొట్టడం ఆరంభించింది. జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు.

తిరిగి చంద్రమౌళి ఆలోచనలు కొడుకు మీదికి తిరిగేయి. టైము రెండు దాటిందేమో ఈ పాటికి పెద్ద డాక్టరొచ్చి బాబ్జీని చూసి వుంటాడా? ఏమన్నాడో? కామెడీ ఆర్టిస్టు కనకారావు వంద రూపాయిలు అప్పు ఇస్తాడనే ఆశతో తను బాబ్జీని వదిలి వచ్చేశాడు. పని మనిషిని బాబ్జీ దగ్గరుంచి వచ్చేశాడు. కనకారావు ఉన్నాడో లేదో తెలీదు కానీ లేడనే వార్త గుమ్మంలోనే అందింది. చేసేది లేక తను వెనక్కి తిరిగేడు.

అసలు బాబ్జీ ఆసుపత్రి పాలవడానికి కారణం బాబ్జీయే. తను వాడ్నెంతో అపురూపంగా పెంచేడు. సినిమా వాతావరణానికి దూరంగా వుంచాలని ఆశించేడు. అయినా వాడికి సినిమా వాసన అంటేసింది.

వాడు నటుడైనా, దర్శకుడైనా, కెమెరామెన్ అయినా... చివరకు రచయిత అయినా బావుండేది. అనీ సంతోషించేవాడు. రచయిత కోట్లు కూడ బెట్టక పోయినా కీర్తి సంపాదిస్తాడు. బాబ్జీ ఇవేవీ కాలేదు. సినిమా ఫాన్స్ అసోసియేషన్ కార్యదర్శి అయ్యేడు. హిందీ సినిమా హీరో జయకుమార్ అంటే బాబ్జీకి ప్రాణం. జయకుమార్ సినిమా రిలీజ్ అయితే చాలు జయకుమార్‌కి 'జై' అంటూ జండాలు పట్టుకు తిరిగేంత పిచ్చివాడయ్యేడు. జయకుమార్ సినిమా రిలీజ్ అంటే నిర్మాతకంటే బాబ్జీకే ఎక్కువ కంగారు. హైస్కూలు చదువు దాటలేదు. చదువు రాకపోయినా పరవాలేదు. కాని సంస్కారం కూడా అబ్బలేదు.




"అమ్మా ధర్మం తల్లీ!" అరిచాడు బిచ్చగాడు.
"భోజనాలు అవలేదు. మళ్లీరా" అరిచింది ఇంటావిడ లోపల్నుంచి.
గంట అటు ఇటూ తిరిగి మళ్ళీ వచ్చాడు బిచ్చగాడు.
"అమ్మా! అన్నం పెట్టు తల్లీ"
"భోజనాల్నీ అయ్యాక వస్తే ఏముంటాయి" విసుక్కుంది ఆ ఇల్లాలు.

—గొల్లపూడి శైలజ

బొంబాయిలో హీరో జయకుమార్ - హీరో ముఖేష్ దాదా, ఒకే నాట్ బాటిల్లోంచి మందు తాగుతూ వుంటారు. ఇక్కడ కుమార్ ఫాన్స్, దాదా ఫాన్స్ జుట్లు పట్టుకుని కొట్టుకుంటారు. ఒకళ్ళ రక్తాలు ఒకరు చూసుకుంటారు.

ఫాన్స్ గొడవల్లో తన్నులు తినడం బాల్జీకి పాతబడి పోయింది. అరిచి అరిచి తను కూడా విసుగెత్తి పోయాడు. అయినా బాల్జీలో మార్పురావడంలేదు.

బాల్జీ కళ్ళకి జయకుమార్ సాక్షాత్తూ దేవుడిలాగానూ, అతని ప్రతికదిలికా నాట్య భంగిమ లాగానూ, ప్రతి మాట వేదవాక్కు లాగానూ వుంది.

ఆ పిచ్చి ఏమిటో తను ఊహించగలడు. ఆ రోజుల్లో తనకి ఫాన్స్‌వుండేవారు. వాళ్ళు తన ఫోటో కోసం... తనని చూడడం కోసం ఎంత వెంపర్లాడి పోయేవారో తనకు తెలుసు. ఆ రోజుల్లో అది తనకి గర్వం కల్గించేది.


బస్‌తోపాటు చంద్రమౌళి ఆలోచనలు సాగుతూనే వున్నాయ్. బస్ నత్తనడక నడుస్తున్నట్టు అనిపిస్తుంది చంద్రమౌళికి. "బస్ త్వరగా నడిస్తే బావుండును. ఈ పూట బాల్జీకి ఎలా వుందో ఏంటో? జనరల్ ఆసుపత్రి అంటే నరకం కంటే అధ్వాన్నం" కానీ బాల్జీ వార్డుకెవరో పాత కాలం ముసలి డాక్టరు పడ్డాడు. బాల్జీని జాగ్రత్తగానే చూస్తున్నాడు.

నిన్న శ్రద్ధగా పరీక్ష చేసి రేపటికి కూడా జ్వరం తగ్గక పోతే... మోచెయ్యివరకు చెయ్యి తొలగించక తప్పదన్నాడు. అదే జరిగితే తన కళ్ళముందే తన కొడుకు అవిటి తనాన్ని చూడాలి. కళ్ళ నీళ్ళు తిరిగేయి చంద్రమౌళికి. కంట్లో ఏదో నలక పడినట్టు నున్నితంగా కళ్ళు అద్దుకున్నాడు.

బాల్జీ సినిమా పిచ్చి వల్లే ఇంత చేటు ఏర్పడింది. సినిమా పత్రికలో బాల్జీ ఫోటో చూసేదాకా తనకి తెలియదు. తను కళ్ళు మూసుకుని వుండిపోయాడు. అందుకు శిక్షగా "నా కొడుకుని అవిటి వాడ్ని చేస్తావా భగవాన్?" బాధగాకళ్ళు మూసుకున్నాడు.

జయకుమార్ నుదుట రక్తం తిలకం దిద్దుతున్న బాల్జీ కలర్ ఫోటో కళ్ళ ముందు కదిలింది. ఫోటోలో నవ్వుతున్నాడు బాల్జీ. ముఖంలో చెప్పలేని ఆనందం. చంద్రమౌళి కనుకొలకుల్లో నీరు నిలిచింది.

హిందీ సినిమా షూటింగ్‌కి మద్రాసు వచ్చిన జయకుమార్ ముందు మహావీరుడులా దేశమాతకి ప్రాణాలు ధారపోస్తున్న దేశ భక్తుడిలా చొక్కా పైకి లాక్కుని నప్పీలు బిగించి ఆవేశంగా కనుక్కున బ్లేడుతో కోసుకున్నాడు. సాక్షాత్తు తెరవేలుపు ముందున్నాడు, పక్కనే తెర దేవత, పత్రికా విలేకర్లు సాటి స్నేహితులు ఎగదన్నుకొస్తున్న సినాభిమానం బలంగా బ్లేడులోపలకు దిగిపోయింది.




అయినా.. బాల్జీ తనకు తెలియనివ్వలేదు. కట్టు తనకళ్ళ బడకుండా తిరిగేడు. ఆ క్షణంలో వెలిగిన ఫ్లాష్ కెమేరాలు పది రోజుల తరువాత కలర్‌లో ఆ ఘనకార్యం పత్రికలో ముద్రించిన ఆ బొమ్మ చూసుకుని మురిసి పోయేదే తప్ప గాయం ముదిరి పోయిందని... అయిదు రోజులుగా రాత్రి కాస్తున్న జ్వరం దానివల్లేనని గ్రహించ లేక పోయాడు.

పేపర్‌లో బొమ్మచూసి తను కొయ్య అయిపోయాడు. బాల్జీ కేపాటి గాయం అయిందోనని చెయ్యి అందుకుని చొక్కా తొలగించి చూస్తే గుండె ఆగిపోయింది.

బాల్జీ నాలుగు రోజుల జ్వరానికి కారణం అప్పుడు అంతు పట్టింది. అప్పటికే గాయం సెప్టిక్ అయింది. తను బతుకు 'వేటలో మామూలు జ్వరమే కదాని పట్టించుకోలేదు. ఇప్పుడది కొంప ముంచేలావుంది. ఈనాటికి పది రోజులుగా ఆసుపత్రిలో వున్నా పరిస్థితి మెరుగు కాలేదు. ఆలోచనల్లో వున్న చంద్రమౌళి కంటికి అవిటి చేత్తో బాల్జీ కనపడ్డాడు. ఉలిక్కిపడి కళ్ళు తెరిచేడు చంద్రమౌళి.

అప్పుడే బస్ రాయ్‌పేట జనరల్ ఆసుపత్రి ముందు ఆగింది. చంద్రమౌళి గభాలున బస్ దిగేడు. అతని మనస్సంతా అల్లకల్లోలంగా వుంది.

"తండ్రీ ఏడు కొండలవాడా! బాల్జీని అవిటి వాడ్ని మాత్రం చెయ్యకు" అని చేతులుగాల్లోకి ఎత్తి దేవుడ్ని ప్రార్థిస్తూ ఆసుపత్రి గేటుకేసి నడిచేడు.

ఎందరో యువకులు తన బిడ్డలాంటి వాళ్ళే... దీపం చుట్టూ తిరిగే దీపం పురుగుల్లా కాలిపోతున్నారు.

ఈనాళే... హీరో జయకుమార్‌కి ఉత్తరం రాయాలి. తనెవరో అతనికి తెలీక పోయినా తన పేరు, జయకుమార్ వినేవుంటాడు. ఈ నాళే ఉత్తరం రాయాలి.

"డియర్ జయకుమార్... ఆ ఫోటోద్వారానీకెంతటి వీరాభిమానులున్నారో... నువ్వు నీ మిత్రులకు చూపి ఆనందించవచ్చు. నీ హీరోయిన్‌లకి చూపి గర్వించవచ్చు. కానీ ఆ ఫోటో ఇంకెందర్ని ప్రలోభ పెడుతుందో, ఇంకెందర్ని అలాంటి గొప్ప పనులు చేసి పేపర్ ఎక్కాలని ఉత్సాహ పరుస్తుందో ఆలోచించేవా?" అని రాయాలి.

చంద్రమౌళి గబగబా వార్డు కేసి నడుస్తుంటే అతనికో సందేహం కలిగింది. తన ఉత్తరాన్ని జయకుమార్ లక్ష్యపెడతాడా? ఇలాంటి ఉత్తరాలు ఎందరో... తండ్రులు గతంలో తనకీ రాశారు. తను లక్ష్య పెట్టేడా? జయకుమార్ లక్ష్యపెట్టడానికి...?

ఎద్దుపుండు కాకికి నొప్పా? నిట్టూర్చి చంద్రమౌళి వార్డులో అడుగు పెట్టాడు. అతన్ని చూడగానే నర్సు మనిషి కంగారుగా చంద్రమౌళికేసి పరుగెత్తుకు రావడం మొదలెట్టింది.

●

## ఆడ పోలీసయిన మగపోలీస్

**అమెరికా రాజధాని వాషింగ్టన్ లోని ఫోర్త్ డిస్ట్రిక్ట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ముప్పై అయిదేళ్ల పోలీసు అధికారి కథ యిది.**

జర్మన్ డేవన్‌పోర్ట్ గడ్డం, మీసాలతో మోటార్ సైకిల్ మీద తిరుగుతూ డ్రగ్స్, సెక్స్‌కి సంబంధించిన నేరస్థుల



పాలిట సింహ స్వప్నంగా వుండేవాడు. విధి నిర్వహణలో 'హి-మాన్'గా పలామణి అయిన ఇతగాడు తన ఫ్రీ టైంలో ఆడవాళ్లలా అలంకరించుకునేవాడు. ఇతని భార్య కేన్సర్ జబ్బుతో మరణించింది. ముగ్గురు పిల్లలు కూడా. ఇంటికి రాగానే ఆడవాళ్ల దుస్తులు ధరించేవాడు. కొలరెడొలోని ఓ సర్జన్ ఇతని కోరిక ప్రకారం సెక్స్ మార్పిడి ఆపరేషన్ చేసి ఇతన్ని స్త్రీగా మార్చాడు. జర్మన్ అనే మొగ పేరుని తీసేసి బొని అనే ఆడ పేరు పెట్టు కున్నాడు. ఇతన్ని ఆడ పోలీసుల సెక్షన్‌కి బదిలీ చేశారు. ప్రస్తుతం వేశ్యల్ని సరఫరా చేసేవాళ్లని, డ్రగ్స్ అమ్మేవారిని పట్టుకునే విభాగంలో పని చేస్తోంది బొని.

"నా చిరకాల వాంఛ అయిన అమ్మాయిగా జీవించడం నెరవేరింది" అంటూంది బొని. —ఎం.శారద